సాక్షి విశాఖపట్నం

శనివారం । 25 । మార్చి । 2023




అతిథులకు లోటు రానీయొద్దు

జీ-20 సదస్సుకు వచ్చే అతిథులకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని మేయర్ వెంకట కుమారి ఆదేశించారు. 8లో



న్యూట్రిఫై జెనీ డేటా ఎనలిటిక్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన మొదటి న్యూట్రిఫై జెనీ డేటా ఎనలిటిక్స్‌ను విశాఖలో ప్రారంభించారు. 8లో



టిప్పర్‌ను ఢీకొన్న గ్యాస్ ట్యాంకర్

జాతీయ రహదారిపై గ్యాస్ ట్యాంకర్ టిప్పర్‌ను ఢీకొంది. అయితే ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదు. 8లో



నేడే మహా బడ్జెట్

జీవీఎంసీ సర్వ సభ్య (ప్రత్యేక) బడ్జెట్ సమావేశం శనివారం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు ప్రారంభంకానుంది. 8లో



బడ్జెట్ అంచనాలివీ..

ప్రారంభ నిల్వ
రూ. 48,058.32 లక్షలు

వివిధ పద్దుల కింద జమ
రూ. 3,82,262.50 లక్షలు

ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమ
రూ. 4,30, 320.82 లక్షలు

అన్ని పద్దుల కింద ఖర్చులు
రూ. 4,06,349 లక్షలు

ముగింపు నిల్వ
రూ. 23,971.82 లక్షలు

విశాఖలో సీసీఎల్ సందడి

సినీతారలతో వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సందడి నెలకుంది. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్)లో భాగంగా శుక్రవారం సెమీ ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. ముంబయి హీరోస్, భోజ్‌పురి దబాంగ్ జట్ల మధ్య జరిగిన తొలి సెమీఫైనల్‌లో దబాంగ్ జట్టు దుమ్మురేపింది. తరువాత తెలుగు వారియర్స్, కర్నాటక బుల్డోజర్స్ మధ్య మరో సెమీస్ జరిగింది. ఈ సందర్భంగా అఖిల్ హీరోగా నటించిన ఏజెంట్ చిత్రంలోని ఓ పాటను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో ఆ చిత్ర హీరోయిన్ సాక్షి విద్య పాల్గొన్నారు.

- విశాఖ స్పోర్ట్స్



ఏజెంట్ చిత్రంలోని పాటను విడుదల చేస్తున్న అఖిల్, సాక్షి విద్య





బంతిని బౌండరీకి తరలిస్తున్న హీరోస్ బ్యాటర్

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ టారిఫ్ విడుదల

సాక్షి, విశాఖపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల ఉత్తర్వులను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్ సీ) చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి శనివారం విడుదల చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఏటీసీ భవన కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, పి.రాజగోపాల్ రెడ్డిలతోపాటు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు కె.సంతోషరావు (ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్), జె.పద్మా జనార్దన్ రెడ్డి (ఏపీసీపీడీసీఎల్) పాల్గొంటారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థుల డిబార్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. శుక్రవారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 128 కేంద్రాల ద్వారా జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 49,373 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 48,346 మంది హాజరయ్యారు. దీంతో 97.92 శాతం హాజరు నమోదైనట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి. ఉమారాణి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. తనిఖీ నిమిత్తం వెళ్లిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం మాల్ ప్రాక్టీస్‌ను గుర్తించి, ఆ ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్ఐవో ఉమారాణి వెల్లడించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

కార్గో లావాదేవీల్లో పోర్టు రికార్డు

ఎంవీపీకాలనీ: కార్గో లావాదేవీల్లో విశాఖ పోర్టు రికార్డ్ నెలకొల్పింది. 22-23 ఫైనాన్షియల్ ఇయర్‌కు సంబంధించి 71.68 మిలియన్ టన్నుల రికార్డు స్థాయి కార్గో లావాదేవీలు నిర్వహించింది. కేంద్ర పోర్టుల మంత్రిత్వశాఖ నిర్దేశించిన లక్ష్యాలను సైతం అధిగమించి ఉత్తమంగా నిలిచింది. గత ఫైనాన్షియల్ ఇయర్‌తో పోలిస్తే 6.93 శాతం వృద్ధిని సాధించింది. ఫైనాన్షియల్ ఇయర్ ముగియడానికి మరో కొన్ని రోజులు గడువు ఉండగానే ఈ రికార్డును సాధించింది. విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ కె.రామమోహన్ రావు నాయకత్వంలో సంస్థ ఈ ప్రగతిని సాధించినట్లు యాజమాన్యం తన బ్లాగ్‌లో వెల్లడించింది.

జాతీయ క్విజ్ పోటీల్లో స్టీల్ ప్లాంట్ ఉద్యోగినుల ప్రతిభ



స్టీల్‌ప్లాంట్ ఉద్యోగినులు శిల్ప, అనిష్కా

ఉక్కునగరం (గాజువాక): జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులు అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐమా) ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో జాతీయ స్థాయి 11వ ప్రగతి క్విజ్ పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన స్క్రీనింగ్ రౌండ్‌లో 40 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగం సీనియర్ మేనేజర్లు శిల్పా శర్మ, అనిష్కా హోతియాల్ జట్టు ప్రథమ స్థానంలో గెలుపొందారు.

నేడు ధరిత్రి గంట

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): ఒక గంట పాటు విద్యుత్ ఆపండి- ధరిత్రి గంటను జయప్రదం చేద్దామంటూ డబ్ల్యూ.డబ్ల్యూఎఫ్ ఇండియా ప్రతినిధి హనీ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం మద్దిలపాలెంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం మాట్లాడుతూ విశాఖ మహానగరంలో రెండు రోజులుగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో ధరిత్రి గంటా నిర్వహించడంపై అవగాహన కల్పించామన్నారు. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్తు ఉపకరణాలను మొత్తం ఆపేయాలని పిలుపునిచ్చారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు అందించాలి

బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వ్యవసాయ, స్వయం సేవ సంఘాలు (ఎస్‌హెచ్‌సీ) బ్యాంక్ లింకేజ్, హౌసింగ్, ఏపీ టిడ్కో ఇళ్ల తదితర రంగాలకు లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జున కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రుణ ప్రణాళిక మూడో త్రైమాసికం అమలు, సాధించిన ప్రగతిపై బ్యాంకర్లతో జరిగిన సమావేశానికి కలెక్టరు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మొత్తం రుణ ప్రణాళికలో డిసెంబర్ 2022 నెలాఖరు నాటికి రూ.49,422 కోట్ల పంపిణీతో 186 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.3,999 కోట్ల లక్షానికిగాను రూ.4,103 కోట్లతో 103 శాతం , ప్రాధాన్యత రంగాలకు సంబంధించి రూ.13,758 కోట్ల లక్ష్యానికి గాను రూ. 9,454 కోట్లు పంపిణీతో 70 శాతం, అప్రాధాన్యతా రంగాలకు రూ.12,876 కోట్ల లక్ష్యానికి గాను రూ. 39,968 కోట్లతో 310 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన వారందరికి ఇళ్ల మంజూరు చేయడం జరిగిందని, వారికి ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడంలోను, రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. జిల్లాలో బ్యాంకింగ్ సేవలు మరింతగా చేరువు కావడానికి అదనపు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్(ఎల్‌డీఎం) వీఎస్ శర్మ, ఆర్‌బీఐ ఏజీఎం నాగ ప్రవీణ్ , డీఆర్డీఏ పీడీ శోభారాణి , ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణ మూర్తి , జీవీఎంసీ యూసీడీ పీడీ పాపినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి అప్పలనాయుడు, జేడీ పశుసంవర్థక శాఖ డా.రామకృష్ణ, జేడీ మత్స్యశాఖ హాజరయ్యారు.

ప్రతిభకు పట్టం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులు
- విశాఖ జిల్లాలో అర్హత సాధించిన 127 మంది
- ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్ పొందే అవకాశం



విద్యార్థి వెన్నెలను అభినందిస్తున్న హెచ్‌ఎం పైడిరాజు, ఉపాధ్యాయులు

విశాఖ విద్య: జాతీయ ప్రతిభాన్వేషణ(ఎన్ఎంఎంఎస్) పరీక్షలో విశాఖ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఎన్ఎంఎంఎస్ ఫలితాలు శుక్రవారం విడుదల కాగా, జిల్లాకు చెందిన 127 మంది అర్హత సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థుల జాబితాను పాఠశాలల వారీగా విద్యాశాఖాధికారులు ప్రకటించారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాసేందుకు అర్హులు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న జాతీయ స్థాయిలో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించగా, విశాఖ జిల్లా నుంచి 2,066 మంది హాజరయ్యారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో ఇందులో 127 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరి జాబితా పరిశీలన అనంతరం, కేటగిరీ వారీగా తుదిజాబితాను ప్రకటించనున్నారు. తుదిజాబితాలో చోటుదక్కించుకున్న విద్యార్థులకు ఏడాదికి రూ. 12 వేలు చొప్పున, ఇంటర్మీడియెట్ పూర్తయ్యేంత వరకు స్కాలర్ షిప్ అందనుంది.

జాతీయ స్థాయి పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను పరిశీలించి, వారికి సమాచారం ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్. మురళీమోహన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, వీటిని సిద్ధం చేసుకునేలా అప్రమత్తం చేయాలని సూచించారు.

'ఆదివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పని చేస్తుంది'

మధురవాడ: ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మార్చి 26వ తేదీ ఆదివారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనిచేస్తుందని సబ్ రిజిస్ట్రార్ మోహనరావు తెలిపారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి తమ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువతకు ఉపయుక్తంగా ఆడియో ఇంజినీరింగ్ కోర్సులు



సంగీత దర్శకుడు కమలాకర్‌ను సత్కరిస్తున్న ఆశీర్వాద్ లూక్స్ తదితరులు

- ఏయూ చూపిన చొరవ అభినందనీయం
- సంగీత దర్శకుడు కమలాకర్

ఏయూక్యాంపస్: యువతకు ఉపయుక్తంగా ఆడియో ఇంజినీరింగ్ కోర్సులు నిలుస్తాయని ప్రముఖ సంగీత దర్శకుడు ప్రాణం కమలాకర్ అన్నారు. శుక్రవారం ఏయూలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో నిర్వహించిన 'మాస్టర్ క్లాస్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఏయూ వర్తమాన సమాజానికి అనుగుణంగా, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఆడియో ఇంజినీరింగ్ కోర్సులను అందించడం అభినందనీయమన్నారు. సంగీత రంగంలో ఎందరో నిష్ణాతులను అందించిన ఆశీర్వాద్ లూక్స్ మార్గదర్శకం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు.

కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, సంగీత, నృత్య విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సంగీత స్వరకల్పనలో వివిధ మెళకువలను వివరించారు. ప్రత్యక్షంగా వేణువుపై పలు స్వరాలకు పలకించి విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో భాగంగా ప్రాణం కమలాకర్‌ను వర్సిటీ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో సుమన్ సెయింట్ లూక్స్ నర్సింగ్ విద్యా సంస్థల చైర్మన్ ప్రీతమ్ లూక్స్ పాల్గొన్నారు.

విజయవంతంగా జీ-20 మాక్ సదస్సు



మాక్ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నగరంలో జీ20 మాక్ సదస్సు నిర్వహించారు. జీ20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా శుక్రవారం ఏయూ కాన్వకేషన్ హాల్‌లో మాక్ సదస్సును నిర్వహించారు. పలు ఆర్థికపరమైన అంశాలను చర్చించారు. అలాగే జీ20 దేశాల అభివృద్ధికి ఏఏ దేశాల సహాయ సహకారాలు అవసరం, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక అంశాలను పరిష్కరించడం ఎలా అనే దానిపై మాక్ కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ మాక్ కాంక్లేవ్ గ్రూప్ ప్యానల్‌కు నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వీసీ వి.బాలమోహన్ దాస్ అధ్యక్షత వహించారు. జీ20 దేశాల తరుపున ఏయూ పరిశోధన విద్యార్థులు, సామాజిక వేత్తలు ప్యానల్‌లో ప్రతినిధులుగా పాల్గొన్నారు. సదస్సుకు వచ్చే అతిథులను భారతీయ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.



సంప్రదాయ నృత్య సందడి





జీ20 సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసమే..

జీ20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు వారిని భాగస్వామ్యం చేయటంలో భాగంగా కొన్ని రోజులుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తెలిపారు. అందులో భాగంగా మాక్ కాంక్లేవ్‌ను నిర్వహించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు కూటికుప్పల సూర్యారావు, సామాజిక వేత్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వెదురు సోయగం

- జీ-20కి వెదురుతో ఆకృతులు
- మైదుకూరులో రూపుదిద్దుకున్న బాస్కెట్లు, పోల్స్, తబలాలు
- ఇప్పటికే నగరానికి చేరుకున్న బ్యాంబూ ఉత్పత్తులు
- వీటిపై పూణే, కడియంల నుంచి రప్పిస్తున్న పూలమొక్కలు
- విశాఖ రోడ్లకిరువైపులా విరబూయనున్న అందాలు
- ఈ తరహా రాష్ట్రంలో ఇదే తొలిసారి



సాక్షి, విశాఖపట్నం : అందాల **విశాఖలో** వెదురు సోయగాలు కనువిందు **చేయను**న్నాయి. జీ-20 దేశాల సదస్సుకు **వచ్చే అతిథు**లను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. **ఈనెల 28,** 29 తేదీల్లో జరగనున్న ఈ సదస్సుకు **విశాఖ నగరం** ఆతిథ్యం ఇస్తోంది. ఇందుకోసం నగరం ముస్తాబవుతోంది. పర్యావరణహిత వెదురుతో మోడరన్ బాస్కెట్లు, బ్యాంబూ పోల్స్, బ్యాంబూ తబలాల ఆకృతితో వీటిని వైఎస్సార్ జిల్లా మైదుకూరులో తయారు చేయిస్తున్నారు. అక్కడ వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం ఉన్న వారితో వీటిని వినూత్నంగా రూపొందిస్తున్నారు. వీటిపై అందంగా పూసే పూల మొక్కలను అమర్చనున్నారు. వీటిని ఆర్కే బీచ్‌లోని నోవోటెల్ హోటల్ నుంచి రుషికొండ సమీపంలో ఉన్న జీ-20 సదస్సు జరిగే ర్యాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతం వరకు రోడ్డుకు ఇరువైపులా, రోడ్డు మధ్యలోని డివైడర్ల పైన, బీచ్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌ల పైన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 500 వరకు బ్యాంబూ బాస్కెట్లు, 50కి పైగా తబలాలు, 200 వరకు బ్యాంబూ పోల్స్ ఉండనున్నాయి. ఇవి కాకుండా మరో వెయ్యి వరకు వెదురు ఫ్లవర్ వాజ్‌లను కూడా సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర బ్యాంబూ మిషన్, మేదరి హ్యాండీ క్రాఫ్ట్స్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా వీటన్నిటినీ తయారు చేస్తున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో వీటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వెదురు ఉత్పత్తులను మైదుకూరు నుంచి సింహాచలం నర్సరీ వద్దకు తీసుకొచ్చారు. రవాణాలో కొన్నింటి వార్నిష్‌లు పాడయ్యాయి. అలాంటి వాటికి మళ్లీ వార్నిష్‌లు వేస్తున్నారు. నేడో, రేపో వీటిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.



పూణే, కడియం నుంచి పూలమొక్కలు

వెదురు ఆకృతులపై ఏర్పాటు చేసే ప్రత్యేక రకాల పూల మొక్కలను (ఫ్లవరింగ్ ప్లాంట్స్) పూణే, కడియం నర్సరీల నుంచి రప్పిస్తున్నారు. వీటిని అమర్చాక పూలు వికసిస్తాయి. అవి నాలుగైదు రోజుల పాటు వాడిపోకుండా ఉంటాయి. నోవోటెల్-రాడిసన్ బ్లూ హోటళ్ల మధ్య బీచ్ రోడ్డులో విదేశీ ప్రతినిధుల రాకపోకలుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వెదురు ఆకృతులపై అమర్చిన పూల మొక్కలు ఈ ప్రతినిధులను ఆకట్టుకోనున్నాయి. ఉగాది సందర్భంగా తాడేపల్లిలోని సీఎంఓ వద్ద ఇలాంటి వాటినే ఏర్పాటు చేశారు. అవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎందరినో అలరించాయి.

ఈ తరహా ఇదే తొలిసారి..

ఇప్పటివరకు దేశంలోని త్రిపుర, అస్సాం, మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాలల్లోనే ఈ తరహా వెదురు ఆకృతులు తయారవుతున్నాయి. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వీటిని ప్రవేశపెడుతున్నట్టు రాష్ట్ర మేదర కార్పొరేషన్ డైరెక్టర్ రాఘవేంద్ర 'సాక్షి'కి తెలిపారు. మైదుకూరులో మూడు వారాల నుంచి వీటి తయారీలో నైపుణ్యం ఉన్న మేదరులు రేయింబవళ్లు శ్రమించి వీటిని రూపొందిస్తున్నారని చెప్పారు. జీ-20 సదస్సు ముగిశాక మళ్లీ వీటిని భద్రపరచుకోవచ్చు. మూడు, నాలుగేళ్ల పాటు ఇవి చెక్కు చెదరవు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి ప్రతిష్టాత్మక సదస్సులు జరిగినప్పుడు మళ్లీ వీటిని బ్యూటిఫికేషన్ కోసం ఉపయోగించుకోవచ్చని గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి 'సాక్షి'కి చెప్పారు. వెదురు పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీంతో ముమ్ముందు వెదురుకు కొరత ఏర్పడదని, పర్యావరణ హిత వెదురుతో అనేక రకాల ఆకృతులను విస్తృతం చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు.

సమర్థంగా విధులు నిర్వర్తించండి

లైజన్ అధికారులకు జేసీ ఆదేశం



లైజన్ అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట: జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధులకు లైజన్ అధికారులు సమన్వయ వారధులుగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అతిథులకు లైజన్ సేవలు అందించేందుకు ఎంపిక చేసిన అధికారులతో సమావేశం నిర్వహించారు. వారి విధులు, అనుసరించాల్సిన వ్యవహార శైలి, తదితర అంశాల పలు సూచనలు చేశారు. లైజన్ అధికారులు విధులు హాజరైనప్పుడు బ్లేజర్, షూస్ తప్పక ధరించాలన్నారు. మొత్తం కార్యక్రమ వివరాలు కలెక్టరేట్ నుంచి పొందాలన్నారు. అతిథులకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలకడం, వాహనం, బస, ఆహార ఏర్పాట్లు తదితర ఆతిథ్య సేవలు అందించాలన్నారు. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్‌తో వారు కోరిన సమాచారాన్ని తెలియజేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. జోన్-1 పరిధి భీమిలిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని చిట్టివలస ప్రాంతానికి చెందిన చేట్ల రాజాన ఫిర్యాదు చేశారు. జోన్-2 పరిధి చినగదిలి సంతపాలెంలో అనధికార కట్టడాలు జరుగుతున్నాయని వి.సుధాకర్, జోన్-3 పరిధి పిఠాపురం కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని భీమరశెట్టి నరసింగరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జోన్-4, జోన్-5, జోన్-6. జోన్-8 నుంచి పలు ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సెంచరీతో చెలరేగిన పాండురంగ

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ–20 క్వార్టర్ ఫైనల్స్‌లో ఈకోర్సా జట్టు 53 పరుగుల తేడాతో వైజాగ్ వెటరన్స్ సీసీపై విజయం సాధించింది. రైల్వే గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఈకోర్సా ఆరు వికెట్లకు 149 పరుగులు చేసింది. దీపక్ 49 పరుగులు చేశాడు. ప్రతిగా వైజాగ్ వెటరన్స్ 96 పరుగులకే ఆలౌటైంది. శంకరరావు మూడు వికెట్లు తీశాడు. జింక్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కావలీర్స్ జట్టు 66 పరుగుల తేడాతో గ్రేహౌండ్స్‌పై విజయం సాధించింది. కావలీర్స్ సీసీ రెండు వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. పాండురంగ వంద పరుగులతో నిలిచాడు. హర్షవర్ధన్ 76 పరుగులు చేశాడు. ప్రతిగా గ్రేహౌండ్స్ 126 పరుగులే చేసింది.

దుమ్ములేపిన దబాంగ్

- ఆసక్తిగా సాగిన సీసీఎల్ తొలి సెమీ ఫైనల్
- వైఎస్సార్ స్టేడియంలో సినీతారల సందడి



విజయ దరహాసంతో భోజ్‌పురి దబాంగ్ టీం

విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం వేదికగా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ తొలి సెమీ ఫైనల్ చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగింది. భోజ్‌పురి దబాంగ్ చివరి రెండు బంతులకు 10 పరుగులు చేయాల్సిన తరుణంలో.. అగర్ ఒక బంతిని ఫోర్‌గా, చివరి బంతిని సిక్సర్‌గా మలిచాడు. దీంతో ముంబయి హీరోస్ ఢీలా పడిపోయారు. ప్రస్తుత సీజన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) నాకవుట్ పోటీలు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు రెండు సెమీస్‌లు జరిగాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన తొలి సెమీస్‌లో ముంబయి హీరోస్‌తో భోజ్‌పురి దబాంగ్ జట్టు తలపడింది. టాస్ గెలిచిన దబాంగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో హీరోస్ ఆటకు దిగారు. టీ–20 మ్యాచ్ అయినా పదేసి ఓవర్లతో రెండు ఇన్నింగ్స్‌గా సాగింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. సమీర్ 34 పరుగులు చేశాడు. ప్రతిగా దబాంగ్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో 29 పరుగులు వెనుకబడింది. ప్రవేశ్ 21 పరుగులు చేశాడు. కెప్టెన్ మనోజ్ తివారి 12 బంతుల్లోనే 19 పరుగులు చేశాడు. ఇక హీరోస్ రెండో ఇన్నింగ్స్‌లో 62 పరుగులకే మరో రెండు బంతులుండగానే ఆలౌట్ అయింది. 92 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దబాంగ్ జట్టు చివరి మూడు ఓవర్లలో 31 పరుగులు చేయాల్సి వచ్చింది. చివరికి దబాంగ్ జట్టు హీరోస్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

తెలుగు వారియర్స్, కర్నాటక బుల్డోజర్స్ మధ్య జరిగిన రెండో సెమీస్‌లో వారియర్స్ జట్టు కెప్టెన్ అఖిల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. బుల్డోజర్స్ తొలి ఇన్నింగ్స్ 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన తెలుగు వారియర్స్ ఆరు వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. కర్నాటక బుల్డోజర్స్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లకు ఐదు వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. 103 పరుగుల లక్ష్యంతో తెలుగు వారియర్స్ బ్యాటింగ్ ప్రారంభించింది. నమస్తే వైజాగ్ అంటూ విశ్వక్‌సేన్ అభిమానులకు విషెస్ చెప్పాడు. ధమ్కీ సినిమాను థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరాడు.



మైదానంలో తమన్ సందడి



మెరిసిన బాలీవుడ్ తారలు

విశాఖలో న్యూట్రిఫై జెనీ డేటా ఎనలిటిక్స్ ప్రారంభం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన మొదటి న్యూట్రిఫై జెనీ డేటా ఎనలిటిక్స్‌ను విశాఖ కేంద్రంగా ప్రారంభించినట్లు న్యూట్రి ఫై టుడే సంస్థ వ్యవస్థాపకుడు అమిత్ శ్రీవాస్తవ, సంస్థ చైర్‌పర్సన్ ప్రియాంక శ్రీవాస్తవ తెలిపారు. విశాఖలోని ఓ హోటల్‌లో వీరు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. న్యూట్రసూటికల్ పరిశ్రమ అభివృద్ధికి 2019 నుంచి కృషి చేస్తున్నామని చెప్పారు. 2019 నుంచి విశాఖ కేంద్రంగా 11 న్యూట్రసూటికల్ ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. న్యూట్రిఫై జెనీ డేటా ఎనలిటిక్స్ ద్వారా న్యూట్రసూటికల్ మార్కెట్ సమయాన్ని 50% తగ్గిస్తుందన్నారు. నూతన ఉత్పత్తుల పరిశోధన నుంచి మార్కెట్‌లోకి వెళ్లే వరకు ఈ న్యూట్రిఫై జెనీ ప్లాట్‌ఫాం తోడ్పుతుందన్నారు. ఈ ప్లాట్‌ఫాంలో 12 లక్షల పరిశోధన పేపర్స్, 10,000కు పైగా న్యూట్రసూటికల్ వస్తువుల వివరాలు, మార్కెట్ మేధస్సుతో కూడిన అత్యంత పటిష్టమైన డేటా వేదిక నిలుస్తుందన్నారు. విశాఖలో ఇంజనీరింగ్, సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ రంగాలకు చెందిన కళాశాలల సహకారంతో ఉమ్మడి పరిశోధనలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

నేడే మహా బడ్జెట్



డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వ సభ్య(ప్రత్యేక) బడ్జెట్ సమావేశం శనివారం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో 2023–24 ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ సభ్యుల ముందుకు రానున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు తయారు చేసి గతేడాది నవంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆమోదానికి స్థాయీ సంఘం ముందుంచారు. స్థాయీ సంఘం సవరించిన బడ్జెట్ అంచనాలను ఆమోదించింది. అవి ఇవి..

- 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్‌లో సచివాలయ భవనాల నిర్మాణాలకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.3కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- ఫ్లైఓవర్ కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.10 నుంచి రూ.50 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.30 నుంచి రూ.60 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నూతన నీటి సరఫరా లైన్ల కోసం 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.80 నుంచి రూ.100 కోట్లకు సవరించాలని ఆమోదించారు.
- జీవీఎస్‌సీసీఎల్ సహకారం(స్మార్ట్‌సిటీ)కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు రూ.200 నుంచి రూ.60 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.250 నుంచి రూ.100 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- సోలార్ లైటింగ్ కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2కోట్ల నుంచి రూ.10 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.2కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని, విరాళాలతో చేపట్టే పనుల కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.4కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.7.50 కోట్ల నుంచి రూ.19.50 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నది/సరస్సులు, నీటి ట్యాంకుల పరిరక్షణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.0.50 కోట్ల నుంచి రూ.2కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.2కోట్లకు సవరించాలని, సీఎండీఎఫ్ కింద ముడసర్లోవ పార్క్ అభివృద్ధి భూమి రక్షణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.13కోట్ల నుంచి రూ.55 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.10 నుంచి రూ.80 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరం అంచనాల బడ్జెట్ ఇలా (రూ.లక్షల్లో)

	జమ	ఖర్చులు
సాధారణ పద్దు	91,458	17,515
ఇంజినీరింగ్	38,466	93,761
లైటింగ్ కింద	--	15,195
ప్రాజెక్టులు	19,350	39,970
ప్లానింగ్	31,540	5,242
యూసీడీ	52,000	53,735
విద్య	15	1,907
పార్కులు, లీజర్స్, సిమెటరీస్‌కు	2,000	11,436
ప్రజారోగ్యం	11,811.50	42,588
మంచినీటి సరఫరా	43,160	25,985
జేఎన్ఎన్‌యూఆర్ఎం	10	5,575
రాజీవ్ ఆవాస్ యోజన	--	500
అమృత్	15,000	16,400
ఇతర నిధులతో ప్రాజెక్టులు	19,120	19,120
ఆర్థిక సంఘం నిధులు	27,600	28,150
డిపాజిట్లు, అడ్వాన్స్‌లు	30,732	29,270

జీ-20 సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

- సమన్వయంతో విధులు నిర్వర్తించాలి
- డ్రోన్లతో కార్యకలాపాలు నిషిద్ధం
- నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

మహారాణిపేట: అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించి జీ–20 సదస్సును విజయవంతం చేయాలని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ కోరారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్(ఏఎస్ఎల్)లో భాగంగా రాడిసన్ బ్లూ హోటల్‌లో జీ–20 సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీ–20 సదస్సు దేశానికి, రాష్ట్రానికి ప్రతిష్టాత్మకరమైందన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వర్తించాలన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో స్వాగత ఏర్పాట్లు, లైజన్ ఆఫీసర్లు, తదితర ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. అతిథులు కాపులుప్పాడ వద్ద ఎనర్జీ ప్లాంట్, ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, మాధవధార వద్ద వాటర్ సస్టైనబుల్ ప్రాజెక్టులను సందర్శిస్తారని వివరించారు. 28న డిన్నర్, సాంస్కృతిక కార్యక్రమాలు, 29వ తేదీన ఉదయం యోగా కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సదస్సు జరిగే రోజుల్లో నగరంలో డ్రోన్లతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. అతిథులు సందర్శించే రోజుల్లో పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు ప్రవేశం ఉండదన్నారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ అతిథులకు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగత ఏర్పాట్లు చేస్తామన్నారు. హోటల్ వద్ద పార్కింగ్, సదస్సుకు వచ్చే అతిథుల రిజిస్ట్రేషన్ కౌంటర్, వసతి, తదితర విషయాలపై జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ సుమిత్ సునీల్ గరుడ్‌లతో సీపీ, కమిషనర్ చర్చించారు.



అతిథుల కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్, కమిషనర్ రాజాబాబు, జేసీ విశ్వనాథన్

బీచ్ ఫ్రంట్‌ను పరిశీలించి అతిథులకు సిటింగ్ ఏర్పాట్లపై చర్చించారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్, పలువురు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాపులుప్పాడ వద్ద ఎనర్జీ ప్లాంట్, ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, మాధవధారలోని వాటర్ సస్టైనబుల్ ప్రాజెక్టులను సందర్శించారు.

అతిథులకు లోటు రానీయొద్దు

- సుందరీకరణ పనులు వేగవంతం
- సీతకొండ వ్యూ పాయింట్‌కు వైఎస్సార్ పేరు
- మేయర్ హరివెంకటకుమారి వెల్లడి

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సుకు దేశ విదేశాల నుంచి విశాఖకు విచ్చేస్తున్న ప్రతినిధులు, అతిథులను ఆకట్టుకునేలా నగరాన్ని జీవీఎంసీ సుందరంగా తీర్చిదిద్దిందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె. సతీష్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పలువురు అధికారులతో కలిసి శుక్రవారం ఎయిర్‌పోర్టు నుంచి రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్ వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అతిథులకు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలకాలని, ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు వద్ద సుందరీకరణ పనులు, ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద మాధవధార వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి తాటిచెట్లపాలెం, తెలుగతల్లి ఫ్లైఓవర్ వద్ద జీ–20 సదస్సులో పాల్గొంటున్న దేశాల పేర్లు, ఆయా దేశాల ప్రాముఖ్యాన్ని చూపే చిత్రాలను మేయర్ తిలకించారు. ఏయూ వద్ద మోడల్ బస్టాప్, స్మార్ట్‌సిటీ పార్క్ వద్ద 20 దేశాల జెండాలతో నిర్మిస్తున్న జీ–20 పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించారు. జోడుగుళ్లపాలెం బీచ్, సీతకొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్, రాడిసన్ హోటల్ బీచ్ ప్రదేశాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీతకొండ బీచ్ వద్ద వ్యూ పాయింట్‌ను డాక్టర్ వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేసేందుకు ప్రతిపాదన చేస్తున్నామని మేయర్ వెల్లడించారు.



సాగర్‌నగర్ బీచ్‌ను సందర్శిస్తున్న మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు

విశాఖ గొప్పతనాన్ని చాటిచెబుదాం

కమిషనర్ మాట్లాడుతూ విశాఖ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే ధ్యేయంతో జీవీఎంసీ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. జీ–20 సమ్మిట్ నేపథ్యంలో విశాఖ వ్యాప్తంగా సుమారు రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. జాతీయ రహదారితో పాటు గ్రీన్ బెల్ట్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుదీకరణ పనులు, వ్యాయామ పరికరాలు, పార్కింగ్, వ్యాపార సముదాయం, బీచ్ వ్యూ పాయింట్లతోపాటు సీతకొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం బీచ్‌లను అభివృద్ధి చేసినట్లు వివరించారు. పర్యటనలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాల్, సత్యనారాయణరాజు, శ్యాంసన్ రాజు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త

- సహజమరణంగా నమ్మించే ప్రయత్నం
- పోలీస్ విచారణలో తేలిన నిజం

సింహాచలం : వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హత్య చేసి, దాన్ని సహజమరణంగా చిత్రీకరిద్దామనుకున్నాడో ప్రబుద్ధుడు. గతంలో అతనిపై ఉన్న ఫిర్యాదు, మృతురాలి బంధువుల ఆరోపణల కోణంలో పోలీసులు విచారణ జరపగా చివరకు తానే హత్య చేశానని అంగీకరించాడు. వివరాలోకి వెళ్తే... జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలేనికి సమీపంలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో ఉంటున్న కిలాని శివ(27)కు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రామలింగాపురం దరి తుమ్మేరుపాలేనికి చెందిన శ్రీదేవి (23)తో 2017లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని సొంతింట్లో శివ నివాసముంటున్నాడు. పై పోర్షన్‌లో శివ తల్లి, అతని అన్నయ్య ఉంటున్నారు. జీవీఎంసీ 8వ జోన్‌లో చెత్త తరలించే వాహనానికి శివ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శివకు కొంతకాలంగా వేరొక మహిళతో వివాహేతర సంబంధం ఉండటంతో భార్య శ్రీదేవి నిలదీస్తూ వస్తోంది. దీంతో తరచూ భార్యను వేధిస్తుండేవాడు. ఈ విషయంపై పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. గురువారం రాత్రి కూడా భార్యతో గొడవపడ్డాడు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో నిద్రిస్తున్న శ్రీదేవి ముఖంపై తలగడ పెట్టి, మెడకు టవల్ చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు.



మృతురాలు శ్రీదేవి

ఉదయం ఆమె లేవడం లేదని, కళ్లు తిరిగి పడిపోయిందని చుట్టుపక్కల వాళ్లని నమ్మించే ప్రయత్నం చేశాడు. తొలుత గోపాలపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, ఆ తర్వాత 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న శ్రీదేవి తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. శ్రీదేవి మృతి చెందిందని తెలుసుకుని ఆమెది సహజ మరణం కాదని, ఆమె భర్తే హత్య చేశాడని వారంతా ఆరోపించారు.

ఈ విషయంపై శ్రీదేవి తల్లి గుంపాడ రాము ఫిర్యాదు మేరకు శివని పెందుర్తి సీఐ అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తానే హత్య చేసినట్టు శివ ఒప్పుకున్నాడు. శ్రీదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న గ్యాస్ ట్యాంకర్

మర్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపైపెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్రాంతంలో ఐఓసీఎల్ నుంచి ఎన్ఏడీ మీదుగా హైవేపై రాయ్‌పూర్ వైపు ఓవర్‌స్పీడ్‌తో 18 టన్నుల గ్యాస్ ట్యాంకర్ వెళ్తోంది. కప్పరాడ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొనడంతో పాటు సమీపంలో విద్యుత్ స్తంభాలను ఢీకొంది. దీంతో గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌పైకి దూసుకుపోయింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీలో గ్యాస్ లోడ్ ఉందని, డివైడర్‌పైకి దూసుకుపోయిన లారీ ట్యాంకర్ ఆగి ఉండకపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు భారీ క్రేన్ల సహాయంతో లారీని తొలగించారు. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలవ్వడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.పశ్చిమ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్యాస్ అథారిటీ నిపుణులు, సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సిబ్బంది సహకారంతో ట్యాంకర్‌ను తొలగించారు. అనంతరం ట్యాంకర్‌ను ఐఓసీఎల్ గొడౌన్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

పినాకిల్‌లో పీడియాట్రిక్ హార్ట్ కేర్ యూనిట్



మాట్లాడుతున్న పినాకిల్ ఆస్పత్రి వైద్యులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం హెల్త్‌సిటీలోని స్టార్ పినాకిల్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ కేర్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు డాక్టర్ జి.వి రెడ్డి తెలిపారు. పినాకిల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది ఉత్తర కోస్తా ప్రాంతంలో మొదటి యూనిట్ అన్నారు. పుట్టుకతోనే తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధులకు గురైన పిల్లలకు ఈ యూనిట్ ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తామని వెల్లడించారు. ఈ యూనిట్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని.. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 12 ఏళ్ల వయసు గల పిల్లలకు గుండె సంబంధిత వైద్య సేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం 10 పడకలతో ఐసీయూ సిద్ధం చేసినట్లు తెలిపారు. పీడియాట్రిక్ బాసినేటర్స్, నియోనాటోల్ వెంటిలేటర్లు, బబుల్ సీ, పీడియాట్రిక్ 2డీ ఎకో ప్రోబ్స్ అండ్ టీ ప్రోబ్స్ తదితర డయాగ్నస్టిక్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్డియాలజిస్టులు డాక్టర్ పవన్, డాక్టర్ విజయ్ మాట్లాడుతూ పిల్లల గుండెకు రంధ్రం పడటం, గుండె కొట్టుకోవడంలో వ్యత్యాసం, గుండె వాల్వు ఇబ్బందులు, బ్లూ బేబీ సిండ్రోం, తదితర గుండె లోపాలకు సంబంధించి సుమారు 500 మందికి ఇంత వరకు ఇక్కడ చికిత్స అందించామన్నారు.

నగరంలో నేడు

- ఉదయం 10.30 గంటలకు ఆస్ట్రేలియా ప్రభుత్వ బృందం మెడ్‌టెక్ జోన్ పర్యటన
- ఉదయం 11 గంటలకు రైల్వేన్యూకాలనీలో విశాఖ సెఫ్టీక్లబ్ ఆవిష్కరణ
- ఉదయం 11 గంటలకు సీతమ్మధార ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ 2023–24 టారిఫ్ విడుదల
- సాయంత్రం 5.30 గంటలకు మేఘాలయ హోటల్‌లో కార్టూన్ ఫెస్టివల్–2023